క్లుప్తంగా

ఆలయం నిర్మాణానికి విరాళం



భిక్కనూరు: తిప్పాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప ఆలయం నిర్మాణానికి సింగిల్ విండో మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్సారెడ్డి- సువర్ణ దంపతులు రూ.11వేల111లను బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన దాతలను శాలువాతో సత్కరించారు. అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ప్రతినిధులు ద్యావర సాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనుబాబు, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



దోమకొండ: దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఏడుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనల మేరకు చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీలు తాటిపల్లి శ్రీకాంత్ , స్వామి, పట్టణ అధ్యక్షుడు సీతారామ్ మధు, మండల యూత్ అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రాపహాడ్‌లో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ గ్రామంలో బుధవారం బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. నాయకులు మల్లేష్, గైని రాజలింగం, లక్ష్మణ్‌చారి, జలంధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, సంజీవరెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు



భిక్కనూరు: కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్ల ధ్రువీకరణ పత్రాలను అందజేసి నిర్మాణ పనులకు పూజలు చేశారు. జీపీ ఈవో మహేశ్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు అందె దయాకర్‌రెడ్డి, నేతలు నర్సింహారెడ్డి మైపాల్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్ ద్యాగల కిరణ్, నర్మల రాంచంద్రం, మద్దూరి రవి, నూర్ మహ్మద్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుండూరులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు విడతల వారీగా బిల్లులు చెల్లింపు చేస్తామని చెప్పారు.

పెద్దమల్లారెడ్డిలో..

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామాన్ని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి ఉన్నారు.

మురికి కాలువ శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం మురికి కాలువలను పంచాయతీ కార్యదర్శి గంగాధర్ శుభ్రం చేయించారు. ఈ నెల 29న సాక్షి దినపత్రికలో వచ్చిన కంపు కొడుతున్న కాలనీలు అనే కథనానికి పంచాయతీ కార్యదర్శి స్పందించి మండల కేంద్రంలోని గిద్దకట్ట కాలనీ, ఉర్దూ మీడియం పాఠశాల వెనుకాల అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువలను కార్మికులతో శుభ్రం చేయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి గంగాధర్ తెలిపారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- రాష్ట్ర సరిహద్దుల్లోని గ్రామాల్లో వణుకు పుట్టిస్తున్న దొంగలు
- సీసీ ఫుటేజీలున్నా కొలిక్కిరాని కేసులు



సీసీ కెమెరాలో నమోదైన అనుమానితులు



మద్నూర్‌లో వరుస చోరీలు జరిగిన టీచర్స్ కాలనీ

మద్నూర్(జుక్కల్): మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న మద్నూర్ మండలంలో తరుచూ దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే వారు టార్గెట్ చేసుకుంటున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలో జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

టీచర్స్ కాలనీలో దొంగల బీభత్సం..

ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక గల టీచర్స్ కాలనీలో నలుగురు మాస్కులు పెట్టుకొని వచ్చిన దొంగలు నాలుగు తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇందులో ఒక్కరు మాత్రమే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇచ్చారు. నలుగురు దొంగలు ఉన్నట్లు సీసీ కెమెరాలో స్పష్టంగా కనపడిన దృశ్యాలు వాట్సాప్‌లో చక్కర్లు కొట్టాయి. ఇది చూసిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు పోలీస్ స్టేషన్ పక్కన తన కారును పార్క్ చేశారు. రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారును దొంగిలించుకు వెళ్లాలని కారు తాళాలు పగలగొట్టాలని ప్రయత్నం చేసినా డోర్లు తెరుచుకోలేదు. తెల్లవారు జామున బాధితుడు కారు డోర్ హ్యాండిల్స్ విరిగినవి చూసి అవాక్కయ్యాడు. అలాగే మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ప్రధానదారిపై ఒకే ఇంటిపై 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అలాగే గాంధీచౌక్‌లో తాళం వేసి ఉన్న రిటైర్డ్ ట్రాన్స్‌కో అధికారి ఇంటి తాళం పగలగొట్టడానికి చూసినా అది పగలలేదు. ఆ తర్వాత దుర్గామాత ఆలయానికి ఉన్న మూడు తాళాలను దొంగలు పగలగొట్టి లోనికి చొరబడ్డారు. వరుసగా దొంగతనాలు చేయడంతో పాటు ప్రధాన కూడళ్లలో దొంగలు రెచ్చిపోతుండటంతో మండల ప్రజలు భయపడుతున్నారు.

బయట నిలిపిన వాహనాలు సైతం చోరీ..

తాళం వేసి ఉన్న ఇళ్లే కాకుండా రాత్రి పూట రోడ్లపై నిలిపిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ద్విచక్ర వాహనాలు, తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరుగుతున్నా అవి పోలీస్ స్టేషన్ వరకు వెళ్లడం లేదని తెలుస్తోంది. పోలీసులు రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నా దొంగలు మాత్రం వారి పని వారు చేసుకొని వెళ్లడం గమనర్హం. పోలీసులు కఠినంగా వ్యవహరించి మండలంలో దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దొంగల్ని పట్టుకుంటాం



దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలి. రాత్రి సమయాల్లో పోలీసు బలగాలతో గస్తీని మరింత పెంచుతాం. ప్రజలు ఆందోళన చెందవద్దు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. -విజయ్‌కొండ, ఎస్సై, మద్నూర్

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోం



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతి

లింగంపేట(ఎల్లారెడ్డి): హిందువుల దేవాలయాలు కూల్చేసి మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోమని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం ఆయన లింగంపేట పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదులోని బంజారాహిల్స్‌లో పెద్దమ్మ ఆలయం కూల్చి కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపించారు. బఫర్ జోన్‌లో ఉన్న ఎంఐఎంకు చెందిన ఫాతిమా కళాశాలను హైడ్రా కూల్చకుండా పెద్దమ్మ ఆలయం కూల్చడం హేయమైన చర్య విమర్శించారు. ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం కొమ్ము కాస్తుందన్నారు. జిల్లా నాయకులు మురళి, దత్తురాం, రామచంద్రం, విష్ణువర్ధన్, రజినీకాంత్ పాల్గొన్నారు.

బీసీ, ఎస్టీల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు



గాంధారి: లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ లబానా సంఘం ప్రతినిధులు మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి ఈ వ్యవహారంలో లబానాలకు మద్దతుగా నిలిచి బీసీ లబానాలకు, ఎస్టీలకు చిచ్చుపెట్టడం సరికాదని గాంధారి మండలానికి చెందిన గిరిజన జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో పైడి ఎల్లారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు మోజీరాం నాయక్, భాగ్య నాయక్, ప్రేమ్ దాస్, దేవీ సింగ్, హేమ్ సింగ్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ భాషను సులభతరం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంగ్లిష్ భాషను విద్యార్థులకు సులభతరం చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సూచించారు. బుధవారం శెట్పల్లిలో తెలుగు, లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ, బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టుల సమావేశం నిర్వహించారు. ఆమె ఇంగ్లిష్ సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు అన్ని భాషల్లో గుణాత్మకమైన విద్య అందేలా చూడాలన్నారు. ఇంగ్లిష్ భాషపై ఉన్న భయాన్ని పిల్లల్లో తొలగించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బోధనోపకరణాలను ఉపయోగించి విద్యా బోధన చేయాలన్నారు.

రాయితీపై ఎకరానికి 50 ఆయిల్ పామ్ మొక్కలు



పిట్లం(జుక్కల్): కారేగావ్ జీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ఉద్యాన శాఖాధికారి సుమన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎకరానికి 50 ఆయిల్ పామ్ మొక్కలు రాయితీపై అందిస్తామని పేర్కొన్నారు. ఈ పంటతో పాటు, అంతర్ పంట సాగు చేసే రైతులకు నాలుగేళ్ల పాటు ఎకరానికి రూ.4,100 చొప్పున ప్రోత్సాహకం అందజేస్తామన్నారు. అదే విధంగా ఆయిల్ పామ్ సాగుకు 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని 13వ వార్డులో రోడ్డుపై ఉన్న చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించడం లేదు. మురికి కాలువలు శుభ్రం చేసిన తర్వాత చెత్తను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. నెల రోజుల నుంచి చెత్త, పూడిక మట్టి అలాగే ఉంది. అధికారులు స్పందించి చెత్తను తొలగించి రోడ్డు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం మందులు విక్రయించాలి



నస్రుల్లాబాద్: మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణదారులు నిబంధనలను పాటిస్తూ ఎరువులు, మందులను విక్రయించాలని మండల వ్యవసాయ అధికారిని భవాని సూచించారు. బుధవారం దుర్కి, మిర్జాపూర్, బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో గల ఫెర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. దీనిలో భాగంగా దుకాణం లైసెన్సు, స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలను పరిశీలించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు పురుగు మందులను విక్రయించకూడదని ఆదేశించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. గురుకులంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసున్నారు. నాయకులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

- తూతూమంత్రంగా మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గుంతలమయంగా మారిన పిట్లం - బాన్సువాడ రోడ్డు



కంభపూర్ - పత్తేపూర్ రోడ్డు

పిట్లం (జుక్కల్): ఇటీవల కురిసిన వర్షాలకు పిట్లం పరిధిలో రోడ్లు చాలా దెబ్బతిన్నాయి. గుంతల రోడ్లలో వాహనదారులకు ప్రయాణం నరకంలా ఉంది. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరవుతున్నా నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. పిట్లం అంబేడ్కర్ చౌరస్తా నుంచి బాన్సువాడ వెళ్లే రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ రహదారి నుంచే ఎక్కువగా బాన్సువాడకు, నిజామాబాద్‌కు వెళ్తుంటారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు ఇలాగే ఉంది. అదే విధంగా పిట్లం నుంచి సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలానికి వెళ్లాలంటే మొరం రోడ్డు సైతం చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారుతుంది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు మొరం రోడ్డుగానే కొనసాగుతోంది. అదే విధంగా పిట్లం మీదుగా హస్నపూర్, కంభపూర్, సంగారెడ్డి జిల్లా పత్తేపూర్, నారాయణఖేడ్‌కు వెళ్లే రోడ్లు.. పిట్లం మండలంలోని చిల్లర్గి, పారేడ్‌పల్లి, అల్లాపూర్, బుర్నపూర్, కుర్తి గ్రామాల రోడ్లు సైతం గుంతల మయంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

నడవాలంటే నరకం..



బాన్సువాడలోని చింతల్‌నాగారం రోడ్డు దుస్థితి

బాన్సువాడ : ఈ బురద రోడ్డుపై రైతులు నడవాలంటే నరకం కనపడుతోంది. వర్షాల కారణంగా అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. బాన్సువాడలోని చింతల్ నాగారం శివారులో రోజూ వందలాది మంది రైతులు నడిచే రోడ్డు ఇది. పట్టణానికి తాగునీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌కు చింతల్‌నాగారం శివారులోని మంజీర ప్రాంతం నుంచి మంచి నీరు సరఫరా అవుతుంది. అయితే మంజీర నది ఒడ్డున నల్లల బావి ఏర్పాటు చేసి అక్కడ ట్యాంకు నిర్మించి పైపు లైను ద్వారా మంజీర నీటిని ఫిల్టర్ బెడ్‌కు పంపిణీ చేస్తారు. ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసిన తర్వాత పట్టణానికి మంచినీరు సరఫరా అవుతుంది. ఇది వరకు బాగానే ఉంది. నల్లల బావి దగ్గరికి వెళ్లే మున్సిపల్ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలోనే చెక్ డ్యాం నిర్మించారు. అధికారులు స్పందించి కనీసం మొరం వేస్తే రైతులు కాలి నడకన, బైక్‌లపై పంట పొలాల్లోకి వెళ్లేందుకు వీలుంటుందని అంటున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కామారెడ్డి క్రైం: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ. కార్మికులు దశాబ్దాలుగా శ్రమ దోపిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కార్మికుల సంక్షేమ బోర్డు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని.. ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, సహాయ కార్యదర్శి అనీష్, నాయకులు రాజు, గోపాల్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో కరెంట్‌తో జాగ్రత్త!

- ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ విజయసారథి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

ఎల్లారెడ్డి: వర్షాకాలంలో ప్రజలు, రైతులు విద్యుత్ వినియోగం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎల్లారెడ్డి విద్యుత్‌శాఖ డీఈ విజయసారథి తెలిపారు. బుధవారం వెల్లుట్లలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించి.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతులు తమ పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, బోరింగ్ మోటార్ల వద్ద మరమ్మతులు సొంతంగా చేపట్టవద్దని అన్నారు. స్టార్టర్ బాక్సులు ప్లాస్టిక్ ఫైబర్ బాక్సులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గృహ వినియోగదారులు కూడా కరెంట్ మీటర్లకు, విద్యుత్ లైన్లకు దగ్గరగా తడి బట్టలు ఆరవేయవద్దని సూచించారు. ఏడీఇ నాగేంద్రప్రసాద్, ఏఇ వెంకటస్వామి, లైన్‌మెన్లు కాశీరాం, రవీందర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి



మద్నూర్(జుక్కల్): ఇంటర్‌లో మెరుగైన ఫలితాల కోసం అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్ జిల్లా విద్యాధికారి షేక్ సలాం సూచించారు. మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలని వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు తీసుకురావాలన్నారు. కళాశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పాఠాలు బోధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్, అధ్యాపకులున్నారు.

సమాచారం..

తాగునీటి సరఫరాపై నేడు సమీక్షా సమావేశం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామీణ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతి తదితర విషయాలపై గురువారం ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఎల్లారెడ్డిలో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశానికి అధికారులు తమ పంచాయతీల నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

బోర్లంక్యాంపు గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో గురువారం ఇంటర్‌లో ప్రవేశం కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పీఈటీ సుప్రిత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో పరిమిత సంఖ్యలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కులం, ఆదాయం , పదోతరగతి మెమోతో కళాశాలలో మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధ్రువ పత్రాలు పరిశీలించి అదేరోజు సాయంత్రం ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రదర్శిస్తామన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక ప్రవచనాలు

బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని అయ్యప్ప ఆలయానికి కాశీ పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్య మహాస్వామీజీ విచ్చేస్తున్నట్లు గురుస్వామి మామిండ్ల రాజు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భక్తులనుద్దేశించి స్వామీజీ ప్రవచనాలు అందజేస్తారన్నారు. అయ్యప్ప మాలాధారణ గావించే స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఫిజిక్స్, ఇంగ్లిష్ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వీణాబాయి తెలిపారు. ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ అయి ఉండి బీఎడ్ పూర్తి చేసి ఉండాలని, ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టుకు సంబంధిత సబ్జెక్టులో బీఎడ్ కలిగి ఉండి టీఈటీలో అర్హత పొంది ఉండాలని ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్ట్ 4న తమ దరఖాస్తుతో పాటు స్టడీ సర్టిఫికెట్లను అందచేయాలని కోరారు.

సంక్షిప్తం

పాల శీతలీకరణ కేంద్రం తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్‌లోని పాల శీతలీకరణ కేంద్రాన్ని బుధవారం విజయ డైరీ జనరల్ మేజరు శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాడితో అధిక లాభాలు ఉన్నాయని, రైతులు వ్యవసాయంతో పాటు పాడి అభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలన్నారు. విజయ డైరీలో పాలుపోసిన రైతులకు అధికంగా డబ్బులను చెల్లిస్తున్నామన్నారు. రైతుల నుంచి నాణ్యమైన పాలను సేకరించాలని సూచించారు. బీఎంసీ చైర్మన్ నరసింహారెడ్డి, ఇన్‌చార్జి మేనేజరు రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్, సిబ్బంది ఉన్నారు.

తాడ్వాయిలో పోస్టాఫీసు కార్యాలయం..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని పోస్టాఫీసు కార్యాలయాన్ని బుధవారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారుల నుంచి ఐరిస్ స్కాన్‌ను పరిశీలించారు. నెలనెలా పింఛన్లు తీసుకుంటున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యదర్శి బాలు, బీపీఎం అర్చన, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్యాంరావు ఉన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

నస్రుల్లాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పీడీఎస్‌యూ, టీఎస్‌పీ విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను విద్యార్థిసంఘాల నాయకులు సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే కాలం కావడంతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాల్ రాజు, నేతలు శ్రీకాంత్, సాయిబాబ, ఆర్.ప్రశాంత్, జి.ఆదర్శ్ ఉన్నారు.

పీజీ సోషల్ వర్క్ విద్యార్థుల సందడి

కామారెడ్డి అర్బన్: సమాజాన్ని జాగృతం చేయడంలో సోషల్ వర్క్ విద్యార్థుల బాధ్యత ఎంతో ఉంటుందని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కళాశాల పీజీ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు, తొలి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కార్యక్రమం నిర్వహించగా ప్రిన్సిపల్ హాజరై మాట్లాడారు. జీవితంలో పట్టుదల, లక్ష్యం, క్రమశిక్షణతో విజయం సాధించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, సోషల్‌వర్క్ విభాగం అధిపతి జి.శ్రీనివాస్‌రావు, సమన్వయకర్త విశ్వప్రసాద్, జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.